## క్లుప్తంగా

### దేవరకొండను జిల్లాగా ప్రకటించాలి



అభివాదం చేస్తున్న జిల్లా సాధన సమితి సభ్యులు

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గాన్ని జిల్లాగా ప్రకటించాలని జిల్లా సాధన సమితి సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం దేవరకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేవరకొండను జిల్లాగా ప్రకటించేంత వరకు గ్రామీణ స్థాయి నుంచి ప్రజలు పార్టీలకతీతంగా సన్నద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. దేవరకొండ జిల్లాగా ఏర్పాటు అయితే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కేతావత్ లాలునాయక్, రమావత్ లాలునాయక్, దాస్యనాయక్, జీవన్‌నాయక్, వనం చంద్రమౌళి, చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, గాజుల రాజేశ్, కొర్ర చందునాయక్, రుక్మారెడ్డి, పంతులాల్, రమేశ్ తదితరులున్నారు.

### బీసీ కుల గణన చేపట్టాలి



కోటి సంతకాల సేకరణ నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

దేవరకొండ : బీసీ కుల గణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్ర కృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేశ్‌నాయక్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల గణన చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని వారు ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే బీసీ కుల గణన చేపట్టిన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏకుల రాజారావు, కొండ లలిత, శ్రీకాంత్, ప్రశాంత్, దయాకర్, జానీ, ఇమ్రాన్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

### నరసింహ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు



నివాళులర్పిస్తున్న శ్రీధర్‌రెడ్డి

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండలంలోని చింతకుంట్ల గ్రామానికి చెందిన కుంచం నరసింహ మృతి కాంగ్రెస్‌పార్టీకి తీరని లోటని ఆ పార్టీ నాయకులు దూదిపాల శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కుంచం నరసింహ మృతి చెందడంతో ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఉప సర్పంచ్ యేకుల సురేష్, కార్తీక్, ఖదీర్, సేవానాయక్, అంజి ఉన్నారు.

### బుడ్డోనితండా నుంచి తిరుపతికి పయనం



తిరుపతికి వెళ్తున్న బుడ్డోనితండావాసులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండలంలోని చిన్నఅడిశర్లపల్లి పంచాయతీ పరిధిలోని బుడ్డోనితండాకు చెందిన 40 కుటుంబాలు ఆదివారం బావోజీ ఆధ్వర్యంలో తిరుపతికి వెళ్లారు. మాఘమాస ఉత్సవాల సందర్భంగా వంశపారంపర్యంగా వస్తున్న ఆచారంలో భాగంగా శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తిరుపతికి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. వారిలో ముఢావత్ వాల్యబావోజీ, జాగ్రు నాయక్, పాండు, వెంకటేశ్‌నాయక్ ఉన్నారు.

### సమస్యల పరిష్కారమే లక్ష్యం



మరమ్మతులు చేయిస్తున్న కౌన్సిలర్

హాలియా : మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని 12వ వార్డు జంగాల కాలనీలో మంచినీటి చేతి పంపు మరమ్మతులకు గురై గత ఏడాది కాలంగా ప్రజలు తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి విషయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి చేతిపంపునకు మరమ్మతులు చేయించినట్లు పేర్కొన్నారు. వార్డు ప్రజల అవసరాలు తీర్చడమే తమ ధ్యేయమన్నారు.

# హాలియా మున్సిపాలిటీకి మహర్దశ

- రూ. 28 కోట్లతో అభివృద్ధి పనులు
- మారనున్న పట్టణ రూపురేఖలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



హాలియాలో చేపట్టిన సమీకృత వెజ్, నాన్ మార్కెట్



మట్టితో చదును చేసిన మినీ స్టేడియం

హాలియా : నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని హాలియా మున్సిపాలిటీకి మహర్దశ పట్టనుంది. ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు 2021 ఆగస్టు 2వ తేదీన సాగర్ అభివృద్ధిపై సీఎం కేసీఆర్ హాలియా వ్యవసాయ మార్కెట్‌లో సమీక్ష నిర్వహించి పలు హామీలు ఇచ్చారు. అందులో భాగంగా హాలియా మున్సిపాలిటీకి రూ. 28 కోట్లు మంజూరు చేశారు. హాలియా మున్సిపాలిటీలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు 2022 మే 14న రాష్ట్ర మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అదే సమయంలో మంత్రి కేటీఆర్ హాలియా మున్సిపాలిటీలోని మినీ స్టేడియం నిర్మాణానికి మరో రూ.3.75 కోట్లు, ఓపెన్ డ్రైయిన్ ఆధునీకరణకు రూ.15 కోట్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం రూ.28 కోట్లతో హాలియా మున్సిపాలిటీలో అభివృద్ధి జరుగుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**అభివృద్ధి పనులివే..**

హాలియా మున్సిపాలిటీల్లో రూ.4.5 కోట్లతో ఎన్ఎస్పీ కెనాల్ బండ్ పొడవునా సీసీరోడ్లు, రోడ్లకు ఇరువైపులా డ్రైయినేజీ, రూ. 5కోట్లతో ఆడిటోరియం నిర్మాణం, రూ. 4.50కోట్లతో మున్సిపాలిటీలోని ఇంటర్నల్ సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, రూ.కోటితో డిజిటల్ లైబ్రరీ, రూ.8.50 కోట్లతో ఎన్ఎస్పీ లెఫ్ట్ కెనాల్ బండ్ వెడల్పు, గ్రీనరీ, సీసీ రోడ్లు, లైటింగ్, సిట్టింగ్ ఏర్పాటు, విగ్రహాల ఏర్పాట్లు, తాగునీరు టాయిలెట్లు, పిల్లలు ఆడుకునేలా ప్లే ఏరియా డెవలప్‌మెంట్. రూ.75లక్షలతో సీసీ రోడ్లు, రూ 1 కోటితో వైకుంఠధామం, రూ. 75లక్షలతో వైకుంఠధామం వరకు సీసీ రోడ్డు, రూ. 3.75 కోట్లు మినీ స్టేడియం నిర్మాణం, రూ.15 కోట్లతో ఓపెన్ డ్రైయిన్ ఆధునీకరణ పనులు, రూ 2కోట్లతో సమీకృత వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ యార్డు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం హాలియా మున్సిపాలిటీలో రూ.2కోట్లతో చేపట్టనున్న సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు మొక్కుబడిగా ప్రారంభినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. పిల్లర్ల పనులు చేపట్టి పనులు నిలిపివేయడం గమనార్హం. రూ. 1 కోటితో చేపట్టనున్న వైకుంఠధామం పనులు 80 శాతం మేరకు పూర్తయి మరో 20 శాతం మేర పనులు జరగాల్సి ఉంది. అదే విధంగా రూ.8.50కోట్లతో ఎన్ఎస్పీ లెఫ్ట్ కెనాల్ బండ్ వెడల్పు పనులు జరుతున్నాయి.

**అభివృద్ధి పనులు జరుగుతున్నాయి**



హాలియా మున్సిపాలిటీలో వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ యార్డు నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. పిల్లర్ లెవల్ వరకు పనులు చేపట్టారు. వైకుంఠధామం నిర్మాణ పనులు 80 శాతం వరకు జరిగాయి. ఎన్ఎస్పీ కెనాల్ బండ్ సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. మిగిలిన పనులను కూడా త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు తీసుకుని సకాలంలో పనులు పూర్తి చేసేందుకు కృషిచేస్తాం.

–వెంపటి పార్వతమ్మశంకరయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్, హాలియా

# అర్హులందరికీ దళిత బంధు వర్తింపజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంజనేయులు

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గ పరిధిలో అర్హులైన దళితులందరికీ దళిత బంధు వర్తింపజేయాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా జిల్లా కోఆర్డినేటర్ ఎర్ర అంజనేయులు కోరారు. ఆదివారం దేవరకొండలో ఏర్పాటు చేసిన తెలంగాణ మాదిగ హక్కుల దండోరా నియోజకవర్గ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 6న దేవరకొండలో నిర్వహించనున్న టీఎంహెచ్‌డీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమానికి టీఎంహెచ్‌డీ రాష్ట్ర అధికార ప్రతినిధి మొండికత్తి లింగన్న హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో పొట్ల ఇద్దయ్య, అంకూరి దానయ్య, జైపాల్, కృష్ణ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సర్పంచ్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని పిల్లిగుండ్ల తండాలో ఈనెల 24,25,26 తేదీల్లో నూతనంగా నిర్మించిన గణపతి, దత్తాత్రేయ, ఆంజనేయ, వెంకటేశ్వర విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు స్థానిక సర్పంచ్ జటావత్ బాజు శంకర్ నాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఉత్సవాలకు సంబంధించిన కరతపత్రాలను గ్రామస్తులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. 24న గణపతి పూజ,పుణ్యావాహచనం, పంచగ్రవ్యప్రాసన, ఋత్వికరణ, 25న జలాధివాసం,క్షీరాధివాసం, గ్రామోత్సవం, మండల పూజ, 26న మండల పూజ, గర్త పూజలు, బీజన్యాసం, ధాతున్యాసం, యంత్రస్థాన, కుంభదర్శనం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకలు జరిగే మూడు రోజులు మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జటావత్ జగదీశ్ నాయక్, గుడి పూజారి స్వామిబావోజీ, చందర్, సైదా, నాగ, ముని, స్వామి, మున్యా, సతీష్, రంగ, మాలిక పాల్గొన్నారు.

# విరాట్ పారాయణం కరపత్రం విడుదల



కరపత్రం విడుదల చేస్తున్న నిర్వాహకులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపు రాజీవ్‌గాంధీ స్టేడియంలో ఫిబ్రవరి 1వ తేదీన సాయంత్రం త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజజీయర్ స్వామి పర్యవేక్షణలో ఆహోబిలం రామానుజజీయర్‌స్వామి, దేవనాథ రామానుజజీయర్‌స్వామిల సమక్షంలో జరిగే శ్రీభీష్మఏకాదశి ప్రయుక్త శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర విరాట్ పారాయణంను ఆదివారం స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు హాజరవుతున్నారని నిర్వాహణ కన్వీనర్, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ తెలిపారు. కార్యక్రమంలో ఫణికుమారాచార్యులు, రామానుజాచార్యులు, కమిటీ సభ్యులు కర్నాటి రమేష్, చిన రమేష్, చిల్లంచర్ల విజయ్‌కుమార్, తిరునగరు నాగలక్ష్మి, గౌరు శ్రీనివాస్, బండారు కుశలయ్య, రాయపూడి ఉమాశంకర్, లకుమారపు పాండురంగయ్య, ఉదయ్ భాస్కర్, గోంగడి సైదిరెడ్డి, గుండా నాగరాజు తదితరులున్నారు.

# అంతర్గత రోడ్ల నిర్మాణానికి కృషి : ఎమ్మెల్యే



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చింతపల్లి : గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గొడుకొండ్ల వీటినగర్‌లో రూ.20లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, రూ.16 లక్షలతో నిర్మిస్తున్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ప్రగతి విప్లవం కొనసాగుతుందని అన్నారు. దేవరకొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండూరు భవాని, జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ, స్థానిక సర్పంచ్ కొండూరు శ్రీదేవి, మండల పార్టీ అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, ఉజ్జిని నరేందర్‌రావు, మాస భాస్కర్, చింతకుంట్ల విజయ్‌కుమార్, పూల యాదయ్య, ఈరేటి మల్లేశ్, బాదేపల్లి పులిరాజు పాల్గొన్నారు.

**గంధం ఊరేగింపు**

మండల పరిధిలోని పోలేపల్లి రాంనగర్ గుట్టపై కొలువుదీరిన గట్టు పీర్ల దర్గా ఉర్సులో భాగంగా ఆదివారం ఒంటెపై గంధం ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. పోలేపల్లి గ్రామం నుంచి బయల్దేరి గంధం ఊరేగింపు కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా గట్టు పీర్ల దర్గాను దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కేతావత్ బీల్యానాయక్ దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, కిష్టారెడ్డి, గున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చాంద్‌పాషా, ఈరేటి మల్లేశ్, పాల్గొన్నారు.

# కేవీపీఎస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హాలియా : కేవీపీఎస్ 2023 సంవత్సరం కాలెండర్, డైరీని ఆదివారం హాలియా పట్టణంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను స్థానిక నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ సమాజంలో తరతరాలుగా వస్తున్న అంతరాలు తొలగిపోయి ఆర్థికంగా సామాజికంగా ప్రజలందరూ అభివృద్ధి చెందినప్పుడే సమాజం ముందుకు పోతుందన్నారు. సామాజిక అణచివేతకు ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా కేవీపీఎస్ నిర్మించే అన్ని పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దైద శ్రీను, జిల్లా కమిటీ సభ్యులు దొంతల నాగార్జున, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుర్ర శంకర్‌నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కోరే రమేష్, నరేష్‌నాయక్, కేవీపీఎస్ నాయకులు మురళి, షాకీర్, నాగరాజు, పెరిక నాగరాజు, కంభంపాటి శ్రీను ఉన్నారు.

# ప్రింటర్, డీటీపీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ప్రింటర్, డీటీపీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘం కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా కట్టబోయిన శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా కర్నాటి విశ్వనాథ్, కోశాధికారిగా దొంగరి రాజులను ఎన్నుకున్నట్లు సీనియర్ యూనియన్ నేతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రింటర్స్, టీడీపీ వారు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఓనర్స్ అసోసియేషన్ నాయకులు కోడి జనార్దన్, మామిడాల ఉపేందర్, తుమురుగోటి చంద్రమౌళి, జంజిరాల ఇద్దయ్య, సత్యం, విజయ్‌కుమార్, యాదగిరి, కోండల్, ఈశ్వర్, ఈశ్వర్‌కుమార్, మురళి, ఆంజనేయులు, అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఖుర్షిద్, సోమలింగం, ఫరీద్, శ్రీను తదితరులున్నారు.

### 26న విరాట్ హిందూ సమ్మేళనం

మిర్యాలగూడ టౌన్ : ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 26న విరాట్ హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బాణావత్ రతన్‌సింగ్‌నాయక్ ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు జరిగే ఆర్ఎస్ఎస్ యూనిఫాం ధరించి స్వయం సేవకులతో సంచలన్, రూట్ మార్చ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

డిండి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీపీ మాధవరం సునీతా జనార్దన్‌రావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గిరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖలకు సబంధించిన మండలాధికారులకు తమ నివేదికలతో సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు.

### జెండా ఆవిష్కరణ

నల్లగొండ : తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో రైతు ఆత్మగౌరవ జెండా పండుగ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఎన్జీ కాలేజీ చౌరస్తాలో జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బాలుయాదవ్ మాట్లాడుతూ రైతుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికి తెలంగాణ రాష్ట్రమంతా జెండా పండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధాన్యానికి, పత్తికి మద్దతు ధర కల్పించాలని, ఏకకాలంలో రైతుల రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా అధ్యక్షులు కిశోర్‌యాదవ్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ప్రేమ్‌సాగర్‌యాదవ్, టేకుల మంజులారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరం



క్రీడాకారులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నల్లగొండ టూటౌన్ : ఉచిత వైద్యశిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని యాదాద్రిభువనగిరి జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ధనుంజయ్య అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ ఔట్‌డోర్ స్టేడియంలో తులసి హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు వైద్యపరీక్షలు చేశారు. శిబిరానికి 50 మంది రాగా వారికి డాక్టర్ మాలె సంతోష్‌రెడ్డి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. స్టేడియం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బొమ్మపాల గిరిబాబు, షేక్ రహీం ఉన్నారు.

# నేడు కొలువుదీరనున్న పాలకవర్గం

- మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న మర్ల చంద్రారెడ్డి



మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ చంద్రారెడ్డి

నిడమనూరు: నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం మర్ల చంద్రారెడ్డి చైర్మన్‌గా సోమవారం కొలువుదీరనున్నది. 2018 అసెంబ్లీ ఎన్నికల అనంతరం కామర్ల జానయ్య చైర్మన్‌గా మార్కెట్ పాలక మండలి ఏర్పాటు అయింది. అతను రెండు దఫాలుగా పదవిలో ఉన్నారు. తర్వాత ఇప్పుడు మర్ల చంద్రారెడ్డి చైర్మన్‌గా పాలకవర్గం రెండు సంవత్సరాల పాటు పదవీకాలంలో ఉండనున్నది. వైస్ చైర్మన్‌గా నిడమనూరు మండలం బంటువారిగూడేనికి చెందిన మెరుగు రామలింగయ్యతో పాటు మరో 14మంది డైరెక్టర్లు సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

**రైతు శ్రేయస్సు కోసం పాటు పడుతా**

రైతు శ్రేయస్సు కోసం పాటు పడతానని సోమవారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా పదవీ స్వీకారం చేయనున్న మర్ల చంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. నిడమనూరులో ఆయన మాట్లాడుతూ రైతు ప్రతినిధిగా గతంలో పనిచేశానని, రైతుల మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ మార్కెట్ సేవలు అందించే వెసులుబాటు కలిగిస్తానన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటి సత్యపాల్, వైస్ చైర్మన్ మెరుగు రామలింగయ్య, పాపయ్య, వైస్ ఎంపీపీ బైరెడ్డి వెంకటరెడ్డి, యాదయ్య, శ్రీనివాసరావు ఉన్నారు.

### ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

త్రిపురారం : నిడమనూరులో సోమవారం జరగనున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి కోరారు. ఆదివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిడమనూరులో శ్రీ బాలాజీ ఫంక్షన్ హాలులో నిర్వహించే ఈ ప్రమాణస్వీకార సమావేశానికి విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో పాటు రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్, ఎ మ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్ రావు, ఎంసీ కోటిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్ హాజరవుతారని తెలి పారు. మండల వ్యాప్తంగా గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మహిళలు, పార్టీ అనుబంధ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# ఫ్లెక్సీలో ఎంపీపీ ఫొటో లేదని వాగ్వాదం



మార్కెట్ చైర్మన్‌తో వాగ్వాదం చేస్తున్న రవి

నిడమనూరు: నిడమనూరులో ఆదివారం రాత్రి అధికార బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల మధ్య ఫ్లెక్సీ చిచ్చురేపింది. నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా త్రిపురారం మండలానికి చెందిన చెందిన మర్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పాలక మండలి ప్రమాణ స్వీకారం చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. మార్కెట్ యార్డు ఎదురుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో అధికార పార్టీ నాయకురాలు, స్థానిక ఎంపీపీ బొల్లం జయమ్మ ఫొటో లేకపోవడం చూసిన ఆమె తనయుడు, రవి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. వాటిని చించి వేయాలని తన అనుచరుల్ని పురిగొల్పాడు. అంతటితో ఆగకుండా ఎంపీపీ బొల్లం జయమ్మ ఫొటో లేని ఫ్లెక్సీలను చింపివేస్తానంటూ అక్కడే ఉన్న మార్కెట్ చైర్మన్ మర్ల చంద్రారెడ్డిని హెచ్చరించాడు. పార్టీ నాయకురాలు, ఎంపీపీ, బీసీ మహిళ అయిన బొల్ల జయమ్మ ఫొటో ఎందుకు ఏర్పాటు చేయలేదంటూ చైర్మన్ మర్ల చంద్రారెడ్డిని ఆయన ప్రశ్నించాడు. తాము కేవలం మార్కెట్ డైరెక్టర్లకు సంబంధించిన వారి ఫొటోలు మాత్రమే అందులో వేశామని, ఫ్లెక్సీలు చించివేయడం తగదంటూ చంద్రారెడ్డి హితవు పలికారు. అనంతరం నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు

చిట్యాల : ఆలయాల అభివృద్ధికి అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తోందని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి చిట్యాలలో శ్రీ అయ్యప్పస్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో గుత్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నెండు వందల కోట్ల నిధులతో యాదాద్రి ఆలయాన్ని నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ అయ్యప్పస్వామి ఆలయానికి తన వంతు సహకారాన్ని అందజేస్తానన్నారు. శబరిమల ఆలయ సహాయ అర్చకులు ఉన్నికృష్ణన్ నంబూద్రి, పట్టణ పురోహితులు దౌలతాబాద్ వాసుదేవశర్మలు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు గుత్తా అమిత్‌రెడ్డి, గురుస్వాములు చంద రవీందర్, గంజి సుధాకర్, జడల చినమల్లయ్య పాల్గొన్నారు.

# అడుగడుగునా.. స్పీడ్ బ్రేకర్లు

- ప్రాణసంకటంగా మారిన ప్రయాణం
- అవసరం లేని చోట తొలగించాలని ప్రజల వేడుకోలు



వినోభానగర్‌లో ఎత్తుగా ఉన్న స్పీడ్ బ్రేకర్



మిర్యాలగూడ పట్టణంలోని చర్చి రోడ్డులో ఎత్తుగా ఉన్న స్పీడ్ బ్రేకర్

మిర్యాలగూడ టౌన్ : ప్రమాదాల నివారణకు రోడ్లపై వేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రయాణికులు, వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. ఒక వైపు మరమ్మతులు మరో వైపు రోడ్ల నిర్మాణ సమయంలో ప్రమాదాల నివారణకు ఒకటి రెండు స్పీడ్ బ్రేకర్లు వేయాలని అధికారులను కోరుతున్నారు. అడుగడుగునా స్పీడ్ బ్రేకర్లు ఉండటంతో పాటు పైపులైన్లు వేయడం కోసం ఎలాంటి అనుమతులు లేకుండానే రోడ్లను తవ్వడం వలన కొన్ని గుంతలు పడి ఉంటున్నాయి. స్పీడ్ బ్రేకర్లతో పాటు గుంతల వలన బస్సులు, వాహనాదారులు కుదుపునకు లోనవుతుండటంతో ప్రయాణికులు అసౌకర్యాలకు గురవుతున్నారు. కొన్ని చొట్ల దగ్గరకు వచ్చేంత వరకు కూడా స్పీడ్ బ్రేకర్లు కనబడటం లేదు. దీంతో సడన్‌గా బ్రేక్‌లు వేయడం వలన బైక్‌లు అదుపు తప్పి పడిపోవడం, వెనుక కుర్చున్న మహిళలు, పిల్లలు కింద పడిన సంఘటనలు కూడా అనేకం ఉన్నాయి. పట్టణంలోని పలు వార్డుల్లో చాలా చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. ప్రధానంగా వినోభానగర్, శేఖర్ కిరాణం రోడ్డు, చర్చి రోడ్డు, వడ్డేరగూడెం, రెడ్డికాలనీ, కూకా రోడ్డు, సీతారాంపురం, ప్రకాశ్‌నగర్, విద్యానగర్, హౌజింగ్‌బోర్డుతో పాటు పలు వార్డుల్లో విపరీతంగా స్పీడ్ బ్రేకర్లు ఉండటంతో ఒక వైపు పాదచారులు, ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అవసరం ఉన్న చోట మాత్రమే స్పీడ్ బ్రేకర్లు ఉంచి అవసరం లేని చోట తొలగించాలని అధికారులను పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**ఎక్కడపడితే అక్కడ స్పీడ్ బ్రేకర్లు**



పట్టణంలో ఎక్కడపడితే అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఉండటం వలన ద్విచక్రవాహనాలకు కొంత ఇబ్బందిగా మారింది. స్పీడ్ బ్రేకర్లు చిన్నవి కాకుండా పెద్ద పెద్దగా ఉండటంతో వాహనాలు వాటిపై వెళ్లాలంటే కింద సైలెన్సర్ తగులుతుంది. స్పీడ్ బ్రేకర్లు తగ్గిస్తే బాగుంటుంది.

– రెమడాల పరశురాములు, మిర్యాలగూడ

**ఇబ్బందిగా ఉంది**



పట్టణంలో ఇంటింటికీ స్పీడ్ బ్రేకర్లు వేయడం వలన కొంత ఇబ్బందిగా మారింది. ఒక వైపు ఇంట్లోకి నల్లాలు వేసుకునుందుకు గుంతలు తవ్వుతుండగా మరో వైపు స్పీడ్ బ్రేకర్లు ఉండటంతో వాహనాలు ఎగిరిపడటంతో నడుము నొప్పులు వస్తున్నాయి.

– శ్రీకాంత్, మిర్యాలగూడ

**కఠినంగా వ్యవహరించాలి**



స్పీడ్ బ్రేకర్లు ప్రధాన సెంటర్లల్లో ఉంటే చాలు. ఇంటింటికీ ఉండటం వలన బ్రేకులు ఆకస్మికంగా వేయడంతో వైర్లు తెడటంతో పాటు స్లీప్ అయి కిందపడిపోతున్నారు. స్పీడ్ బ్రేకర్ల విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలి.

– దయాకర్, మిర్యాలగూడ